## తాడిమేటి శ్రీదేవి




# స్పర్శ

"లాస్యా! ఈ కాఫీ కొంచెం నాన్నగారికిచ్చేసి రావమ్మా!" విజయ వంటింట్లోంచి పిలిచింది.

"ఉండమ్మా నేను స్నానానికి వెళ్తున్నాను. నువ్విచ్చెయ్యొచ్చు కదా" బట్టలు తీసుకుని గబగబా బాత్రూమ్ వైపు నడిచింది లాస్య.

"ఏంటే పెద్ద ఆలస్యం అయిపోతున్నట్లు. ఎంతసేపిచ్చి వెళ్తావు?" విసుగ్గా అరిచింది విజయ.

"నేనొచ్చి తీసుకుంటాలే. దాన్నెందుకు పిలుస్తావు?" వంటింటిలోకి వస్తూ అన్నాడు సుధాకర్.

"తమ కూతుర్ని నేనేమీ తవ్వి తలకెత్త మనలేదు బాబూ! కాస్త కాఫీగ్లాసు ఇక్కడ నుండి అక్కడికి మొయ్యమన్నానంతే" కయ్యిమంది విజయ.

"ఎందుకో విజ్జీ! ఈ వంటింటి గడప దాటి లోపలకి వచ్చావంటే నువ్వేంటోలా మారిపోతావు. నిన్ను పలకరించాలంటే భయంగా ఉంటుందనుకో" భయపడిపోతున్నట్లే మొహం పెట్టాడు.

"అవును. మీకు మరీ భయం పాపం! పొద్దున్నే విసిగించకండి" చిరాకు పడింది.

"అన్నట్లు ఏడున్నర అయినట్లు ఉంది. ఈ రోజు ఆయుర్వేద విజ్ఞానంలో ఏదో మందు రాసుకోవాలనుకున్నాను" స్వగతంగా అనుకుంటున్నట్లుగా అని జారుకున్నాడు సుధాకర్.

"లాసూ! నా పెన్ను తీసావా?" అరిచాడు అచ్యుత్. "ఎందుకురా? దాన్ని అని, అనిపించుకుంటావ్? అచ్చూ, పెచ్చూ అనుకుంటూ ఇది మొదలెడుతుందింక. పెద్దవాళ్లయ్యేకొద్దీ గొడవలు కూడా పెరిగిపోతున్నాయి. చిన్నపిల్లలప్పుడే నయం" విసుగ్గా అంటూ సోఫాలో కూలబడింది.

"పోన్లేవోయ్! పెద్దవాళ్లయి ఉద్యోగాలు, పెళ్లిళ్లు అయ్యాక కొట్టుకుంటారేంటీ?" అన్నాడు సుధాకర్ పక్కనే కూర్చుని బూటు లేసులు కట్టుకుంటూ.

"బావుంది సంబడం!" సన్నగా మూతి తిప్పింది విజయ.

"నేను తియ్యలేదన్నయ్యా" నెమ్మదిగా చెప్పిన లాస్య గిరుక్కున వెనక్కి తిరిగింది.

"ఏంటో మన లస్సీకి మధ్యన బుద్ధి మరీ బూరెలు తినేస్తోందమ్మా. లాసన్నా, లస్సీ అన్నా మాట్లాడడం లేదు" చెల్లెల్ని ఏడిపించాడు అచ్యుత్.

లాస్య ఎలాంటి జవాబు ఇవ్వకుండా బుక్స్ సర్దుకోవడానికన్నట్లు లోపలికి వెళ్లింది.

"తమరు చప్పున బయల్దేరాలి లాసమ్మా! నిన్న తమరి పుణ్యమాని అయిదు నిమిషాలు లేటు" బైక్ తాళాలు వేలితో గిరగిరా తిప్పాడు అచ్యుత్.

వెంటనే వచ్చి "వస్తానమ్మా! వస్తా నాన్నా" బయల్దేరింది.

ఎప్పటిలా అన్న వెనుక అటో కాలు, ఇటో కాలు వేసుకుని కూర్చోకుండా, బైక్ సీట్ చివరగా ఒక పక్కకి సర్దుకుని కూర్చుని చున్నీ ఎగరకుండా జాగ్రత్తగా పట్టుకుని "పదన్నయ్యా" అంది లాస్య. ఏమైంది దీనికి అన్నట్లు ఒక చూపు చూసి బైక్ పోనిచ్చాడు అచ్యుత్.

సుధాకర్ కూడా బయలుదేరి వెళ్లాక మిగిలిన సర్దుడు పనులన్నీ పూర్తి చేసుకుని ఒక కప్పు హార్లిక్స్ కలుపుకుని హాల్లోకి వచ్చి కూర్చుంది విజయ. లాస్య ఎందుకలా డల్‌గా ఉంటోంది హుషారు లేకుండా? ఆరోగ్యం బాగానే ఉంది. మరేమై ఉంటుంది? ఈ రోజుల్లో కొందరాడపిల్లలు ఇట్టే ప్రేమలో పడుతున్నారు. అలా ఏమైనా అయి ఉంటుందా? ఛ! ఛ! అలా అయ్యుండదు. ఏమన్నా ఉంటే నా దగ్గర చెప్పకుండా ఉంటుందా? నా దగ్గర చనువే కదా! రకరకాల ఆలోచనలు చుట్టుముడుతున్నాయి. ఈ రోజు నుంచి దాన్ని కొంచెం జాగ్రత్తగా గమనించాలని నిర్ణయించుకుని వాషింగ్ మెషీన్‌లో బట్టలు వేయడానికని లేచింది.

లాస్య సాయంత్రం వచ్చి, టీ తాగి రిలాక్స్ అవుతోంది. విజయ వంటింట్లో గ్రైండర్ లోంచి పిండి తీస్తోంది. పేపర్ బిల్ కోసం వచ్చే అతను వచ్చాడు. "లాస్యా! బీరువాలో డబ్బులుంటాయి ఇయ్యి, నా చెయ్యి పిండిలో ఉంది" చెప్పింది విజయ. తప్పనిసరన్నట్టు లేచిన లాస్యని చూస్తే చిరాకు పుట్టింది విజయకి. రెండు రోజులు పేపర్ ఇవ్వలేదంటూ గుర్తొచ్చిన విజయ హాల్లోకి వచ్చింది చెప్పడానికి. లాస్య డబ్బు టీపాయ్ మీద పెట్టి తీసుకోమనడం, రశీదు తీసుకుంటున్నప్పుడు చివరల పట్టుకుని తీసుకోవడం గమనించింది. లాస్య మొహంలో ఏదో ఇబ్బంది. పేపర్ రెగ్యులర్‌గా వచ్చేలా చూడమని చెప్పి పంపించాక లాస్యను ఏదో అడుగుదామనుకుని నోరు తెరవబోయి తమాయించుకుంది. మర్నాటి నుంచి కూతురికి తెలియకుండా తనను పరిశీలించడం మొదలుపెట్టింది.

"నాన్నా! నాన్నా!" అంటూ సుధాకర్ వెనకనే ఉండే లాస్య వాళ్ల నాన్నను తప్పించుకుని తిరగడానికి చూస్తోంది. అచ్యుత్ ఏడిపిస్తుంటే ధీటుగా సమాధానమిస్తూ మరీ అవసరమైతే జుట్టు పీకడమో, గట్టిగా గిల్లడమో చేసే లాస్య అచ్యుత్‌తో మాటలు బాగా తగ్గించేసింది. టీవీ చూస్తున్నప్పుడు ఏమైనా లవ్ సీన్స్ లాంటివి వస్తుంటే వెంటనే ఛానెల్ మార్చేస్తోంది. అందరూ అక్కడే ఉండి మార్చడం కుదరకపోతే అక్కడ నుంచి ఏదో వంకతో లేచి వెళ్లిపోతోంది. విజయకి ఏమీ అర్థమయీ కాకుండా ఉంది. అలాగని ప్రతి విషయం భర్తతో దాచకుండా చెప్పే అలవాటున్న విజయ ఈ విషయం సుధాకర్‌తో మాట్లాడలేకపోయింది. అసలెలా చెప్పాలో కూడా తెలియడం లేదు. లాస్యంటే ప్రాణం పెట్టే సుధాకర్ దీని గురించి ఎలా రియాక్ట్ అవుతాడో కూడా ఆమె ఊహకి అందడం లేదు.

విజయ ఆలోచనలు అంతులేకుండా సాగిపోతున్నాయి. ఇల్లు మాప్‌తో తుడుస్తోంది. చేతులు పనిచేస్తున్నా మనసు పరిపరి విధాల పరుగెడుతోంది. ఫోన్ మోగిన శబ్దంతో హాల్‌లోకి వచ్చింది. తన బెస్ట్ ఫ్రెండ్ విశాల గొంతు వినగానే ప్రాణం లేచొచ్చింది విజయకి. "విజ్జీ మేము, మా ఆడపడుచు వాళ్లు, మరిది వాళ్లు అందరం కలిసి చిన్నతిరుపతి వెళ్దామని ప్లాన్ చేశాం. నాకు అడ్డు వచ్చిపడింది. పిల్లలు చిన్నబుచ్చుకుంటారని నేనే ఈయన్ని తీసుకెళ్లమంటున్నాను. రేపు, ఎల్లుండి సెలవులే కాబట్టి లాస్యని నా దగ్గరికి పంపించు. లేకపోతే బోర్‌కొట్టి ఛస్తాను. నీ బంగారుతల్లిని పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాను సోమవారం సరేనా?" విశాల గలగలా మాట్లాడుతోంది. ఆడబోయిన తీర్థం ఎదురయిందనిపించింది విజయకి.

లాస్యలో వచ్చిన మార్పు, తన ఆలోచనలు గబగబా వివరించింది. "నువ్వేమీ కంగారుపడకు. నేను నెమ్మదిగా కనుక్కుంటాను" హామీ ఇచ్చింది విశాల. లాస్యకు విశాల దగ్గర చనువెక్కువే. విశాలాంటీ వాళ్లింటి కంటే వెంటనే ఒప్పుకుంది.

సోమవారం విశాల వాళ్లాయన లాస్యని దింపి వెళ్లారు. లాస్య మొహం ఇదివరకటిలా ఉండడం, వాళ్ల నాన్న, అన్నయ్యలతో ప్రేమగా ఇదివరకులా నడుచుకోవడం చూసిన విజయ హాయిగా ఊపిరి పీల్చుకుంది. కానీ లాస్య బాధ ఏమిటో, దానికి తన స్నేహితురాలు వేసిన మంత్రమేమిటో మాత్రం అర్థం కాలేదు. పిల్లలు, భర్త వెళ్లిన వెంటనే ఇల్లు తాళం వేసి, స్నేహితురాలింటికి బయలుదేరింది.

"వచ్చావా? రా.. నీ కోసమే చూస్తున్నాను" ఆహ్వానం పలికింది విశాల.


''నీకెంతైనా థాంక్సే.. ఏమయింది దానికసలు?" డైరెక్ట్‌గా విషయానికి వచ్చేసింది విజయ.



"ఇలా రా. ముందు కూర్చుని మాట్లాడుకుందాం" కాఫీ తెచ్చిచ్చి మొదలుపెట్టింది విశాల.

"లాస్య సమస్య వింటే నాకు నిజంగా గుండె తరుక్కుపోయింది విజ్జీ! ముందసలు ఓపెన్ అవ్వలేదు. చాలా జాగ్రత్తగా రాబట్టాల్సి వచ్చింది" విజయ కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అక్షరం పొల్లుపోకుండా వింటోంది.

"ఈమధ్య కాలంలో పేపర్లలోనూ, టీవీల్లోనూ ప్రేమించడం లేదని అమ్మాయిల్ని చంపడం, దగ్గర సంబంధీకులే అమ్మాయిల్ని పాడుచేయడం, యాసిడ్ దాడులు ఇవన్నీ చదివి, చూసి దాని బుర్రంతా భయంతో నిండిపోయింది. ఆ మధ్యన ఒక పేపర్లో సొంత తండ్రే కూతుర్ని అనుభవించేవాడని, రెండో కూతుర్ని కూడా అలాగే చేయబోతే పెద్దకూతురు చెల్లెలి జీవితం కూడా పాడుకావడం ఇష్టం లేక బయట పెట్టేసిందని వార్త వచ్చింది. అలాగే అప్పట్లో శ్రీలక్ష్మిని మనోహర్ గొడ్డలితో నరకడం, స్వప్నిక, ప్రణీతలపై




యాసిడ్ దాడి, ఈ మధ్యన అనూష అనే అమ్మాయిని రాజమండ్రిలో రాజేష్ అనేవాడు గొంతుపై కోసి అడ్డువచ్చిన తల్లి, తండ్రులను చంపిన సంఘటన వరకూ అన్నీ దాని మనస్సులో ముద్రపడిపోయాయి. నువ్వు సరైన సమయంలో గమనించుకున్నావు. కొన్నాళ్లు పోతే సైకియాట్రిస్ట్ దగ్గరకి తీసుకువెళ్లవలసిన అవసరం వచ్చేది" విజయ రెప్పవాల్చడం మర్చిపోయింది.


"అవే అవే విషయాలు సినిమా రీలులా మనసులో తిరగడం ఒక కారణం. అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమలంటూ ఒకరినొకరు కవ్వించుకోవడం, కొందరమ్మాయిలు మోసగింపబడటం, అబ్బాయిలు భవిష్యత్ పాడుచేసుకోవడం, ఆత్మహత్యలు ఇవన్నీ దాని బుర్రలో తిరిగి తిరిగి చివరకు దానికి మగవాళ్లంటే ఒక రకమైన ఏవగింపు, భయం మొదలయ్యాయి. "నాకు ఎవరైనా మగవాళ్లు తగిల్తేనే చిరాగ్గా అనిపిస్తోందాంటీ. అన్నయ్యని, నాన్నగారిని కూడా అలా అనుకోవడం చాలా తప్పని తెలిసినా నేను ఫ్రీగా ఉండలేకపోతున్నాను. నాన్నగారిని, అన్నయ్యని బాధపెడతానేమోనని గిల్టీగా ఉంది. అసలు నాకేమీ అర్థం కావడం లేదంటూ భోరుమంది" విజయ మాటలు మర్చిపోయినదానిలా చూస్తోంది.

"అప్పుడు నేనిలా చెప్పాను విజ్జీ!... స్పర్శ అనేది చాలా ముఖ్యమైనదమ్మా. స్పర్శ లేకపోతే మనుషుల మధ్య ప్రేమాభిమానాలుండవు. నువ్వు చాలా సున్నితమైన మనసున్నదానివి. ఇలాంటి దారుణాలు విన్నప్పుడు నీ మనసు కదిలిపోవడం సహజమే. కానీ ఒక్క విషయం నువ్వు గుర్తుంచుకోవాలి. మా కాలంలో కన్నా ఈ కాలంలో ఆడపిల్లలు మరింత తెలివిగా మసలుకోవడం ఎంతైనా అవసరం. నువ్విలా ఉంటే నీ ఎదుగుదలకి, భవిష్యత్తుకి ఎంత అడ్డంకి అవుతుందో తెలుసా? స్పర్శల్లో మంచీ, చెడూ కూడా ఉంటాయి. ఏది ఎటువంటిదనేది నువ్వు తెలివిగా ఉండి గుర్తించగలగాలి. అవసరమైతే నిన్ను నువ్వు రక్షించుకోగల చాకచక్యాన్ని పెంపొందించుకోవాలి. ముందు నువ్వు చక్కగా చదువు మీద కాన్సన్‌ట్రేట్ చేయాలి. అది నీకు కావల్సిన ఆత్మస్థైర్యాన్నిస్తుంది. ఇలా భయంతో, అనవసరపు ఆలోచనలతో ఆడపిల్లలు ఎలా ముందుకెళ్లగలరు లాస్యా? మన దేశంలో ఎందరో మహిళలు ఉన్నత పదవుల్లో ఉన్నారు. వారందరూ ఇలాంటి అనవసరపు ఆలోచనలు పెట్టుకుంటే ముందుకెళ్లగలిగేవారా? ముందు మనల్ని మనం తయారుచేసుకోవాలి. నెహ్రూ ఏమన్నారో తెలుసా? ఒక మహిళ ముందడుగు వేస్తే ఆమె తోటి ఆమె కుటుంబం, గ్రామం అలా అలా మొత్తం దేశమే ముందుకు నడుస్తుందన్నారు. అందుకని నువ్వు చక్కటి చదువు అనే లక్ష్యాన్ని మరువక. అదే నీకు నమ్మకమైన తోడు. ఇలాంటి ఆలోచనలతో నీ చదువు వెనుకబడిపోవడం లేదూ?"

"అవునాంటీ. చదువుకుందామంటే, ఏవేవో ఆలోచనలు. అమ్మతో చెప్పేద్దామనిపిస్తుంది. కానీ ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. మీ దగ్గర చెప్పగలిగాను" అంది. ఇలా ఈ రెండురోజుల్నించి ఎన్నో విషయాలు ఉదాహరణలతో సహా వివరిస్తూనే ఉన్నాను. ఇంట్లో ఎవరూ లేకపోవడం మంచిదయ్యింది. లేకపోతే అదసలు బయటపడేది కాదేమో? ఇప్పుడు దాని మనసు మబ్బులు తొలగిన ఆకాశమయ్యింది" అంది విశాల నిట్టూరుస్తూ.

"నిజమైన స్నేహితురాలివంటే నువ్వేనే" విశాలను గాఢంగా కౌగిలించుకుంది విజయ.

○



## రజనీ వీరాభిమాని

శ్రీలంక సంచలన క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ తమిళుడే అయినా శ్రీలంక పౌరుడు. అయితే అతని భార్య మాత్రం చెన్నయ్‌కి చెందినది. మురళీధరన్ ఐపియల్ టీముల్లోని 'చెన్నయ్ సూపర్ కింగ్స్' జట్టులోని సభ్యుడు కూడా. రజనీకాంత్ సినిమాలంటే భలే క్రేజ్ మురళీధరన్‌కి. రజనీ తాజా చిత్రం 'రోబో'కోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నానంటున్నాడు. అయితే ఆ చిత్రం విడుదల సమయానికి తను ఇండియాలో కాకుండా 'ఛాంపియన్స్ లీగ్'లో ఆడేందుకు సౌతాఫ్రికాలో వుండాల్సి వస్తోందిట. అందుకని అక్కడ్నించి తిరిగి వస్తూనే ఆ సినిమాని చూస్తానంటున్నాడు మురళీధరన్. బహుశా 'రోబో' అక్టోబర్ మొదటి వారంలోనే విడుదల కావచ్చునంటున్నారు.